క్లుప్తంగా

ఘనంగా శ్రీమాత జన్మదిన వేడుకలు



తెనాలి రూరల్: పట్టణ నాజరుపేటలోని శ్రీ అరబిందో విద్యా కేంద్రంలో శ్రీమాత జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఏవీఆర్ పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీమాత పతాకాన్ని ఆవిష్కరించారు. మాతా జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో అరబిందో ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పి. రాఘవేంద్రరావు, కమిటీ సభ్యులు నాగమల్లేశ్వరి, లక్ష్మి, ఎస్‌కే బాషా, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తెనాలి: రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిరూపమని వైఎస్సార్ సీపీ బీసీ నేతలు కొనియాడారు. శాసన మండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 14 మందిని అభ్యర్థులుగా జగన్‌మోహనరెడ్డి ఖరారు చేశారనీ, వీరిలో 11 మంది బీసీలే కావటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశంగా పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా బీసీలకు పెద్ద పీట వేస్తున్నట్లు వివరించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు కోలా వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, దొడ్డక సాంబశివరావు, రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లబండి సుష్మ కిశోర్‌రాజు, కొడాలి కాంతి, పెసర్లంక రమణ, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, షేక్ మీరావలి, కాకి దేవసహాయం, కఠెవరపు శంకర్, జాకీరా, వీర్లపాటి విజయలక్ష్మి, దేవరపల్లి కిశోర్, నాని, నాగమల్లేశ్వరరావు, ఏవీ లక్ష్మి, సుధాస్వప్న పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయాలపాలైన ఘటన తెనాలి–చందోలు రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన దంపతులు జాన్‌బనియన్, భానుప్రియ వ్యక్తిగత పనులపై మండలంలోని పెదరావూరుకు బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జగ్గడిగుంటపాలెం వంతెన వద్దకు రాగా వెనుక నుంచి వచ్చి వాహనం ఢీకొట్టింది. ఘటనలో దంపతులిద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికుల 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు పంపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. పట్టణ అమరావతి ప్లాట్స్ ఇందిరానగర్ కాలనీకి చెందిన బండి అనిల్(50) రేషన్ డోర్ డెలివరీ వాహనం హెల్పర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎలుకల మందు తిన్నాడు. కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి



మంగళగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ఆర్కేను నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం తరువాత అత్యధిక పెద్ద రంగం చేనేత రంగమని, ఈ రంగంలో అత్యధిక మంది ఉపాధి పొందుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘ నేతలు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది చేనేత కార్మికులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగా మరో రెండు లక్షల మంది ఉప వృత్తుల వారు ఉపాధి పొందుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం గత రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించిందని, ఈ నిధులు నేతన్ననేస్తం పథకానికే సరిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల 2023- 24 రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే ఆర్కే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి డి రామారావు, జిల్లా కమిటీ సభ్యులు జె శివ భవన్నారాయణ, ఎస్ నరసింహారావు పాల్గొన్నారు.

ఆలయ సేవకులకు సముచిత స్థానం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- నాయీబ్రాహ్మణులను భాగస్వాములను చేసిన ప్రభుత్వం
- బీసీలకు పాలనాధికారంలో పెద్ద పీట



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: మంగళవాయిద్యాలతో నిత్యం స్వామిని కొలుస్తూ సేవకులుగా ఉంటున్న నాయీబ్రాహ్మణులకు రాష్ట్రంలోని అన్ని దేవాలయాల పాలకమండళ్లలో సముచిత స్థానం కల్పిస్తూ, ఆయా ఆలయాల ప్రగతి, దర్శన సౌకర్యాలు, భక్తులకు వసతి సదుపాయాల కల్పనలో భాగస్వాములను చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందన సభ మంగళవారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సభకు కురగంటి రఘురామయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, బీసీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిలోకి తీసుకురావాలన్నదే జగన్ అభిమతమన్నారు. బీసీలకు 60–70 శాతం రాజకీయ పదవులు గతంలో ఎవ్వరూ ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్ర క్యాబినెట్ నుంచి నిన్న ప్రకటించిన ఎమ్మెల్సీ పదవుల వరకు బీసీలకు అత్యధికంగా అవకాశాలను కల్పించినట్లు వివరించారు. మరోవైపు సంక్షేమ పథకాలను అందిస్తూ బీసీల జీవన ప్రమాణాలను పెంచుతున్నారని గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల మహిళలకు వైఎస్సార్ చేయూతతో ఆదుకుంటున్నట్టు చెబుతూ, కులవృత్తి షాపులున్న నాయీబ్రాహ్మణులకు జగనన్న చేదోడు కింద ఏటా రూ.10 వేల వంతున సాయం చేస్తున్నారని తెలిపారు. తెనాలిలో 639 కుటుంబాలకు ఇప్పటివరకు రూ.63.90 లక్షలను నేరుగా ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. తెనాలిలో నాయీబ్రాహ్మణ భవనానికి త్వరలోనే స్థలం మంజూరు చేయనున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్యే అందులో భవన నిర్మాణానికి అంతా కలిసొస్తే ఆలోచన చేద్దామని అన్నారు. రాజకీయంగా పదవులను కల్పిస్తూ, సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ నేతలు తాడిబోయిన రమేష్, కొడాలి శ్రీకాంత్, కోలా వాసు, సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రిమ్మనబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షుడు కాకాని వెంకటేశ్వరరావు, వర్కింగ్ అధ్యక్షుడు యద్దనపూడి శివ, మున్నంగి సత్యం మాట్లాడారు. సభానంతరం సీఎం జగన్, ఎమ్మెల్యే శివకుమార్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



దావులూరులో జగనన్న కాలనీ లేఔట్లను పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

కొల్లిపర: జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన స్థలాలలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోనే దావులూరులో జగనన్న లేఅవుట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేఅవుట్లు లెవల్ చేయటానికి వెంటనే ఇసుక తోలుకునేందుకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. కాలనీలో ఐదు వాటర్ మోటార్లు పనిచేయటం లేదని లబ్ధిదారులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కాలనీలో పది గృహాలకు కరెంట్ కలెక్షన్ లేదని వివరించగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, వైస్ ఎంపీపీ–2 అద్దంకి బోసు బాబు, సర్పంచి సంధ్యాదేవి, తూములూరు పంచాయతీ కార్యదర్శి రవి శంకర్, దావులూరు పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్, వీఆర్వో రామారావు పాల్గొన్నారు.

వైభవంగా మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థిని

తెనాలి టౌన్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని అలేఖ్య తెలుగుతల్లి వేషధారణలో ఆకట్టుకుంది. తెలుగుదనంలో భాగంగా కూచిపూడి నృత్యాలు, జానపద గీతాలు, కోలాటం, పాటల పోటీలు, సామెతలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. విద్యార్థులతో శ్రీకృష్ణదేవరాయలు 'భువన విజయం' నిర్వహించారు. రంగురంగుల ముగ్గులతో పాఠశాల ఆవరణలో అలంకరించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌ఎం శోభాదేవి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కల్చరల్ సెక్రటరీ ఎం.అన్నారావు, తెలుగు ఉపాధ్యాయులు జాన్ అహ్మద్, బుల్లా శోభ, ఉపాధ్యాయులు డేవిడ్ సన్, లక్ష్మయ్య, మారుతీ కిరణ్ పాల్గొన్నారు.

భాష్యం హైస్కూల్లో..

తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్లో మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యాధికారి హృదయరాజ్ మాట్లాడుతూ మాతృభాష పట్ల విద్యార్థులకు ప్రేమ ఉండాలని, మాతృభాషలో పట్టు సాధించిన వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పాటలు, చమత్కార పద్యాలు, పొడుపు కథలు విప్పడం, తమాషా ప్రశ్నలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు హృదయరాజ్, ప్రధానాచార్యులు రాము బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు శ్రీధర్, సుజాత, వరుణ్ కుమార్, లీలాకృష్ణప్రియ పర్యవేక్షించారు.

నేడు వృద్ధాశ్రమ భవనం ప్రారంభం

గాంధీజీ స్ఫూర్తితో 18 ఏళ్లుగా నడుస్తున్న ఆశ్రమం



ఆశ్రమ నూతన భవనం

తెనాలి: 'నా జీవితమే నా సందేశం' అన్న గాంధీ ఆదర్శంగా జీవించేవారు అరుదుగా ఉంటారు. అలాంటి వ్యక్తుల్లో తెనాలికి చెందిన వజ్రాల రామలింగాచారి ఒకరు. ఉన్నత విద్యావంతుడు. సాధారణ దస్తావేజు లేఖరి. గాంధీకి గుండెలో, ఇంటిలోనూ గుడికట్టాడు. దేవుడిలా పూజిస్తున్నారు. ఏ దిక్కూలేని వృద్ధుల కోసం మహాత్మా సేవాశాంతి ఆశ్రమం నిర్వహిస్తున్నారు. ఆశ్రమవాసుల కోసం దాతల సాయంతో బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజికి సమీపంలో నూతన భవనం నిర్మించారు. 18 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఆశ్రమం బుధవారం నుంచి ఆ భవనంలో ఆరంభమవుతోంది.

రామలింగాచారి జీవిక కోసం దస్తావేజు లేఖరి వృత్తిని చేపట్టారు. ప్రవృత్తిగా సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. ఆలపాటి రవీంద్ర కళాపీఠం అధ్యక్షుడిగా, యూనివర్సల్ హ్యూమానిటీస్ అసోసియేషన్ వ్యవస్థాపకుడిగా సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

గాంధీజీ ఆత్మకథతో ఆరాధకుడిగా..

'గాంధీజీ ఆత్మకథ చదవటం నా జీవితాన్ని మలుపు తిప్పింది' అంటారు రామలింగాచారి. గాంధీ జన్మస్థలం పోర్‌బందరు, సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించారు. 'గాంధీ అష్టోత్తరం, సహస్ర నామావళి' రచించారు. స్థానిక కొత్తపేటలోని కొల్లావారివీధిలోని తన నివాసంలో గాంధీకి గుడి ఏర్పాటు చేశారు. నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఎదురుగా గాంధి, కస్తూరిబాల విగ్రహాలు అమర్చారు.

ఆశ్రమం ఏర్పాటు..

2004లో మహాత్మాగాంధి సేవాశాంతి ఆశ్రమం పేరుతో వృద్ధాశ్రమాన్ని తన ఇంట్లోనే ప్రారంభించారు. తర్వాత సొంతిల్లును ఆశ్రమానికి కేటాయించి, కుటుంబాన్ని అద్దె ఇంట్లోకి మార్చారు. ఆశ్రమంలో ఏ ఆసరా లేని వృద్ధులకు వసతి, భోజనం, వైద్య పరీక్షలను సొంత ఖర్చులతో చేయిస్తున్నారు.

సొంత భవనం..

ట్రస్ట్ సభ్యుల సహకారం, దాతలు, వదాన్యుల వితరణతో రూ.90 లక్షలతో భవనం నిర్మించగలిగారు. 101 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించాలన్న తలంపుతో గ్రౌండ్‌ఫ్లోర్, మరో రెండతస్తుల భవనాన్ని తలపెట్టగా, ప్రస్తుతానికి ఒకటో అంతస్తు వరకు పూర్తయింది. నూతన భవనంలోకి ఆశ్రమాన్ని తరలిస్తున్నారు. ఆశ్రమ బాధ్యతల్లో ఉపాధ్యక్షుడు మద్దాళి శేషాచలం, ప్రధాన కార్యదర్శి ఎంఏ లింకన్‌బాబు, కార్యదర్శి లక్కోజు రవి, సంయుక్త కార్యదర్శి లక్కోజు బాలమురళీకృష్ణ, యార్లగడ్డ కోటేశ్వరరావు, మాలేపాటి హరిప్రసాద్, కన్నెగంటి బాపనయ్య చౌదరి, మండవ ధనుంజరావు సహకరిస్తున్నారు.

రైల్వే ఉద్యోగుల నిరసన



తెనాలి రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రైల్వే ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు చేపట్టిన ధర్నాకు మద్దతుగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తెనాలి శాఖ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. తెనాలి పీడబ్ల్యూ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఉద్యోగులు నినాదాలు చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని అంటూ నినదించారు.

అగ్నికుల క్షత్రియులకు ఎమ్మెల్సీ కేటాయించాలి

మంగళగిరి: అగ్నికుల క్షత్రియులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లేటి బాబూరావు కోరారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇచ్ఛాపురం నుంచి తడ వరకు తీర ప్రాంత వెంబడి సుమారు 40 లక్షల జనాభా నివసిస్తున్నారని అన్నారు. 10 నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా, 50 నియోజకవర్గాల్లో పరోక్షంగా గెలుపు ఓటములు శాసించగలిగిన స్థాయిలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో అగ్నికుల క్షత్రియులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సుతో అగ్నికుల క్షత్రియులకు కనీసం ఒక్క ఎమ్మెల్సీ పదవినైనా కేటాయించాలని కోరారు. అగ్నికుల క్షత్రియ పల్లవసేన రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథపల్లి నాగ సుందరం, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మోపిదేవి శివనాగ రాజు, కృష్ణాజిల్లా అధ్యక్షులు వాడపల్లి అర్జున రావు, కార్యద ర్శులు పితా నాగేంద్రకుమార్, టి.అశోక్‌చక్రవర్తి, రాష్ట్ర ప్రచారకార్యదర్శి కె.నాగబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రాయపూడి(తాడికొండ): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18 సంవత్సరాలు ఆడపిల్లకు, 21 సంవత్సరాలు మగ పిల్లలకు నిండకుండా వివాహం జరిపిస్తే శిక్ష తప్పదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి సునీత అన్నారు. బాల్య వివాహలపై రాయపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆధునిక ప్రపంచంలో క్లౌడ్ కంప్యూటరింగ్‌కు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఆచార్య డి రాజా చిలకపాటి

మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న బాలికలకు ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించిన క్లౌడ్ టెక్నాలజీ అవగాహన సదస్సు మంగళవారం ముగిసింది. విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం సహకారంతో అమెజాన్ వెబ్ సర్వీస్ ద్వారా స్కిల్ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ క్లౌడ్ సంస్థ ఎడబ్ల్యూఎస్ ప్రతినిధి ఆచార్య డి రాజా చిలకపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయంగా ఎంతో డిమాండ్ ఉన్న క్లౌడ్ టెక్నాలజీ పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా అధ్యాపకులకు, విద్యార్థులకు క్లౌడ్ నైపుణ్యం పెరుగుతుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో క్లౌడ్ కంప్యూటరింగ్ ప్రాముఖ్యతను వివరించారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు క్లౌడ్ నైపుణ్యం ఉన్న వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈవిధమైన కార్యక్రమాల ద్వారా పాఠ్యాంశాలపై విద్యార్థినుల జ్ఞానాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి కెరీర్‌లో కూడా ఎంతగానో సహాయపడుతుందన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో స్కిల్ అభివృద్ధి విభాగం, ఎడ్యుస్కిల్‌తో పాటు అద్భుతమైన అనుబంధం కలిగి ఉన్న కారణం చేత వివిధ విభాగాల్లో విద్యానంతరం విద్యార్థులకు నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాల కల్పనలో సహాయపడుతుందన్నారు. ఈ సదస్సు అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు వివిధ స్థాయిల్లో ఎడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్ పరీక్షలు నిర్వహించినట్లు స్కిల్ అభివృద్ధి డీన్ డాక్టర్ ఎ శ్రీనాథ్ తెలిపారు. 30 మందికిపైగా అధ్యాపకులు, విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో గ్లోబల్ సర్టిఫికెట్‌లు పొందడం విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక మైలు రాయి అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ, ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎస్ వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ జగదీష్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి రామకృష్ణ, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుబ్రమణ్యం, డాక్టర్ టి పవన్ కుమార్, డాక్టర్ రూత్ రమ్య, డాక్టర్ శ్యామ్, డాక్టర్ పి రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లారినెట్ విద్వాంసుడు మస్తాన్ సాహెబ్‌ను సన్మానం



మస్తాన్ సాహెబ్‌ను సన్మానిస్తున్న పోతురాజు, ఏడుకొండలు తదితరులు

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం పెళ్లి చేసి చూడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు షేక్ మస్తాన్ సాహెబ్‌ను ఘనంగా సన్మానించారు. బుధవారం గండికోట రహస్యం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, కంచర్ల ఏడుకొండలు, మాదల కోటేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, మొవ్వ పిచ్చయ్య, జొన్నకూటి నీలాంబరం, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని,ఎన్‌టీఆర్ జగన్, ముప్పాలనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమ కాలువకు మరమ్మతులు

మంగళగిరి: దుగ్గిరాల మండలం మోరంపూడి రోడ్డు పేరుకలపూడి కృష్ణా పశ్చిమ మెయిన్ కాలువ అంచున్న ఉన్న చానల్ హెడ్ స్లూయిస్ వద్ద మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి మంగళవారం మరమ్మతు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ స్థానిక రైతు సోదరుల ద్వారా సోమవారం కృష్ణా పశ్చిమ మెయిన్ కాలువ హెడ్ స్లూయిస్ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడిందని విషయం తెలుసుకున్న తాను సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తి చేయించడం జరిగిందని, శాశ్వత మరమ్మతులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని కోరారు. దుగ్గిరాల మండలంలో గత వేసవి కాలంలో తన సొంత ఖర్చులతో రైతుల కోసం డొంకరోడ్ల మరమ్మతులు చేపట్టానని, ఈ వేసవిలో కాలువ కట్టల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఇరిగేషన్‌శాఖ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.


పేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మంగళగిరి: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన పేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజిల చేతుల మీదుగా ఎమ్మెల్యే ఆర్కే పంపిన రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డీవీఆర్, రజనీకాంత్, బాషా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వంసిద్ధం

- ఈనెల 26న పెండ్లి కుమారునిగా నృసింహుడు
- మార్చి 5న పొన్న వాహనం
- 6న కల్యాణ మహోత్సవం
- 7న దివ్య రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికారులు



గాలి గోపురం (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సన్నద్ధం చేస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మహిమగల మంగళాద్రి నృసింహుడు భక్తులకు 26వ తేదీ పెండ్లి కుమారుని ఉత్సవంలో దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం 27వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి.

28న హనుమంత వాహనం, మార్చి 1వ తేదీ రాజాధి రాజ వాహనం, 2న యాలి వాహనం, 3న సింహ వాహనం, 4న హంస వాహనం, అదే రోజు రాత్రి గజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 5న ఉదయం కల్పవృక్ష వాహనం, అదే రోజు రాత్రి 7 గంటలకు పొన్న వాహనం, 6న అశ్వ వాహనం, 7న బంగారు గరుడోత్సవం నిర్వహించనున్నారు. 7న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దివ్య రథోత్సవం వైభవంగా జరుగనుంది. వేల సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో ఈఓ రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తుండగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 8న చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం, 9వ తేదీ శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

వివిధ ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు తరలిరానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు క్యూలైన్లతోపాటు తాగునీరు, మజ్జిగ అందించడంతోపాటు అన్న ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తునికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దైవ దర్శనంతోపాటు ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కే సూచించిన నేపథ్యంలో అధికారులు బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.